క్లుప్తంగా

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అన్నదాత వెంకటరమణారావు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

నేడు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్ల పంపిణీ

సోమశిల: అనంతసాగరం మండలంలోని మంచాలవల్లి, సోమశిల సచివాలయాల పరిధిలోని గృహసారథులకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను సోమవారం పంపిణీ చేయనున్నట్లు మండల సచివాలయాల కో ఆర్డినేటర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సోమశిల, మధ్యాహ్నం 2 గంటలకు మంచాలవల్లిలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహసారథులు, గ్రామసచివాలయ కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిపేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు తొలగించాలి

జలదంకి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మండలంలోని రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లను ఆయా పార్టీల వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా తొలగించకపోతే ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

ఏపీజీఈఏ నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లూరు నగర శాఖ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీజీఈఏ సిటీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా సతీష్‌బాబు, నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కనకాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శైలేంద్రకుమార్, కోశాధికారిగా నారాయణతో పాటు వివిధ శాఖలకు చెందిన ఏడుగుర్ని ఉపాధ్యక్షులుగా, మరో ఏడుగుర్ని సంయుక్త కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యవర్గాన్ని ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున, జిల్లా కోశాధికారి రామ్‌ప్రసాద్, తదితరులు అభినందించారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):ముత్తుకూరు రోడ్డులోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడారు. పోటీలకు 177 మంది క్రీడాకారులు హాజరుకాగా, వీరిలో 16 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు ఉన్నారని చెప్పారు. ఆర్‌ఎల్ చెస్ అకాడమీ నిర్వాహకులు రామ్‌లక్ష్మణ్, ఆర్బిటర్స్ వంశీకృష్ణ, వెంకటరమణ, ప్రదీప్, సుధాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

నెల్లూరు(బారకాసు): వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను ఆర్డీపీ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో నెల్లూరు రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న అందజేయనున్నామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. హైస్కూల్లో అత్యధిక మార్కులను సాధించిన వారు, రంగస్థల కళాకారులకు నగదు పురస్కారాలు, దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేయనున్నామని పేర్కొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కల్యాణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రామకృష్ణ

ఇందుకూరుపేట: శ్రీనల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికసాయంతో గ్రిగ్స్ కోవూరు జోన్ క్రీడాపోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలను వ్యాపారవేత్త దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి, కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చి, కొడవలూరు, విడవలూరు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించిన అతిథులు టార్చ్‌రన్ నిర్వహించి శాంతికపోతాలు ఎగురవేశారు. ముఖ్యఅతిథి దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోటీల కోసం క్రీడామైదానాన్ని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం పెంపొందుతాయని తెలిపారు. నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీలత, కార్యదర్శి ఎం.వల్లవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో విజేతలకు సుమారు 1000 బహుమతులు క్రీడాకారులకు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, దేశభక్తి గీతాలు అలరించాయి. ఇందుకూరుపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉమామహేశ్వరి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నిర్వాహకులు క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, కోవూరు జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, డీటీ బషీర్, నాయకులు ఉడతా వెంకటశేషయ్య, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, షబ్బీర్, మధుసూదన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పామంజి శ్రీనివాసులు, శ్రీహరికోట ప్రసాద్, కూనంగారి వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లికార్జునరెడ్డి, పామంజి నరసింహ, సర్పంచ్ తాతా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు



పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



కోదండరామస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఇప్పటివరకు మండలంలో 7 ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భక్తుల కోరిక మేరకు నూతన ఆలయాలను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి కాకాణికి వేదపండితులు ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, నాయకులు మద్దెన సుబ్బయ్యనాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రాల భద్రతపై పరిశీలన

సంగం: మండల కేంద్రమైన సంగంలోని ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఏటీఎం సెంటర్లలోని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..లేదాని పరిశీలించారు. ఏటీ ఎంల భద్రతకు సంబంధించిన వివరాలను నిర్వాహకుల నుంచి సేకరించారు. ఏటీఎం సెంటర్ల వద్ద రాత్రి గస్తీ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.



ఏటీఎం కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

ఇష్టపడి చదివితే విజయం తథ్యం



విద్యార్థినులకు సూచనలిస్తున్న వైద్యుడు

మనుబోలు: విద్యార్థులు చదువును కష్టంగా భావించకుండా ఇష్టపడి చదివితే విజయం తథ్యమని డాక్టర్ సాయి శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శ్రీవిద్యానికేతన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థినులు పరీక్షలకు సంసిద్ధతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల గురించి ఒత్తిడికి లోనుకాకూడదని తెలిపారు. మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని, సరిపడినంత నిద్రపోవాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ మహేశ్వరి, కరస్పాండెంట్ జగదీష్‌బాబు, గ్రామీణ వైద్యుడు పృథ్వీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు నిమ్మల చంద్రశేఖర్ ఇటీవల చెట్టుమీద నుంచి పడి మృతిచెందగా ఆయన కుటుంబానికి జిల్లా గౌడ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆదివారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని రేబాల గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్య ఆశయాలను కొనసాగిస్తూ కల్లుగీత కార్మిక బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమణయ్య, రాజా, చినగోవింద్, హజరత్, దశయ్య, రాము పాల్గొన్నారు.

మంత్రి కాకాణి అభినందన



మంత్రి కాకాణిని సత్కరిస్తున్న సొసైటీ పాలక వర్గం

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీకృష్ణ ప్రైమరీ షీప్ బ్రీడర్స్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం అభినందించారు. సొసైటీ చైర్మన్ మేకల సాయికృష్ణ, సభ్యులు దొడ్ల సుబ్బారావు, పంగులూరు శీనయ్య, మేకల గోపాలకృష్ణ, ఆవుల సుబ్బారావు, శింగర సురేష్, ఆవుల మస్తాన్‌బాబు తదితరులు నెల్లూరులో మంత్రి నివాసంలో మంత్రి కాకాణిని కలిశారు. అనంతరం పాలక వర్గం మంత్రి కాకాణిని సత్కరించింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, నెల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు.

'అపస్' రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు



కరపత్రాలు పంచుతున్న అపస్ నాయకులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే రాజగోపాలాచార్యులు, ఎస్ చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఆదివారం వారు పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. 1982లో ఏర్పాటైన అపస్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. అపస్ రాష్ట్ర మహాసభలను మార్చి 5,6 తేదీల్లో నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నాయకులు హాజరవుతారని వివరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

అపస్ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కట్టుబోయిన బ్రహ్మానందానికి మద్దతుగా అపస్ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి మణికంఠాచార్యులు, ఆత్మకూరు మండల బాధ్యులు పీ అనిల్ కుమార్, జీ పెంచలరెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, హరీష్ కుమార్‌రెడ్డి, కే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి వేర్వేరుగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు.

ప్రత్యామ్నాయం వైపు అడుగులు

- పత్తి పంట సాగు చేస్తున్న రైతులు
- క్వింటాలు రూ.8 వేలు
- ఆశించిన స్థాయిలో దిగుబడి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

పొదలకూరు: వరి పంటకు బదులుగా పొదలకూరు ప్రాంతంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ నీటి వసతితో పండే పత్తి పంట సాగు చేస్తున్నారు. పత్తి పంట ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ పంట సాగు చేపట్టారు. సాధారణంగా పొదలకూరు ప్రాంతంలో సాగునీటి వసతులు పెరగడంతో రైతులు వరి, నిమ్మ, పత్తి పంటల సాగు చేస్తున్నారు. పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల మండలాల్లో ఈ ఏడాది పత్తి సాగు పెరిగింది. మండలంలో స్వల్పంగా పత్తి సాగు చేపట్టే రైతులు ఈ ఏడాది 1,400 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

పంట మార్పిడిపై దృష్టి

సోమశిల, కండలేరు ప్రాజెక్టుల వల్ల పుష్కలంగా సాగునీరు అందుతుండడంతో ఈ ప్రాంత రైతులు వరి సాగు చేస్తుంటారు. దీంతో ధాన్యం దిగుబడి పెరిగి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో గతేడాది పత్తి పంట సాగు చేపట్టి ఊహించని విధంగా లాభాలు ఆర్జించారు. ఫలితంగా ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. చీడపీడలు సైతం పెద్దగా లేకపోవడంతో ఎకరానికి 1 టన్ను నుంచి 1.5 టన్నుల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఆశాజనంగా ధరలు

ప్రస్తుతం పత్తి టన్ను రూ.80 వేల వరకు పలుకుతున్నట్లు అధికారులు తెలిపారు. పంట నాణ్యంగా ఉంటే మరో రూ.500 కూడా పెంచి అడుగుతున్నారు. రైతు ఎకరానికి రూ.30 వేలు మాత్రమే పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. చీడపీడలు లేకుండా దిగుబడి వస్తే ఎకరానికి రూ.50 నుంచి రూ.60 వేల వరకు ఆదాయం ఉంటుంది. గతేడాది అక్టోబర్ నుంచే రైతులు పత్తిసాగు చేస్తుండగా కొందరు ఈ ఏడాది జనవరి నుంచి సాగు చేస్తున్నారు.

హజ్ యాత్రకు విమాన సౌకర్యం కల్పనపై హర్షం

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింల కోసం విజయవాడ నుంచి విమాన సర్వీసు కల్పించి యాత్రికుల ఇబ్బందులను తొలగించడంపై జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్పి యస్దాని, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ముస్లింలు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి హజ్ యాత్రకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఆయా రాష్ట్రాల వారు అక్కడి ముస్లింలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింల ఇబ్బందులను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నుంచి విమాన సౌకర్యం కల్పించి ఎంతో మేలు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. హజ్ కమిటీ చైర్మన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి హజ్ యాత్రికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంపై ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

కల్లుగీత కార్మికుడికి చేయూత



పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు వెంపులూరు పెంచలనర్సయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి చేయి విరగడంతో ఆదివారం ఆయనకు గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వారు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఉప్పల రామకృష్ణగౌడ్, యువత గౌరవాధ్యక్షుడు తాళ్ల రాజాగౌడ్, ముత్యంగౌడ్, తిరుపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో వీ లవ్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ఫౌండేషన్ రీజనల్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లేక్‌వ్యూ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. లేక్‌వ్యూ కాలనీలోని ఒకటో వీధికి చెందిన రమేష్‌బాబు చిన్న కుమారుడు సునీల్‌కృష్ణ (21) నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ఫైనలియర్ చదువుతున్నారు. ఈ క్రమంలో రమేష్‌బాబు, అతని భార్య, పెద్ద కుమారుడు నగరంలోని బంధువుల వివాహానికి శనివారం వెళ్లారు. ఆ సమయంలో సునీల్‌కృష్ణ ఇంట్లో ఉన్నారు. రాత్రి 11 గంటలకు వారు ఇంటికి రాగా, బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు సునీల్‌కృష్ణ ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. దీంతో దర్గామిట్ట పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ జరిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కాగా ఆత్మహత్య చేసుకునే సమయంలో సునీల్‌కృష్ణ సెల్ఫీ వీడియో తీసుకున్నారని సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.